Disclaimer: we collected these articles from Internet part of Social Awareness Campaign, we are thankful to the creators. We use for non-profit, free education purpose only. To know more, please visit: www.freegurukul.org

# అంకురం తోడు.. వైద్యం అందుబాటు

కొంగొత్త సేవలు, ఉపకరణాల ఆవిష్కరణ

అందుబాటులోకి కొత్త తరహా సాంకేతిక పరిజ్ఞానం

వైద్య సేవల వ్యయాలు తగ్గే అవకాశం

ఈనాడు - హైదరాబాద్



ఆరోగ్య సేవల రంగంలో అంకుర సంస్థల శకం మొదలైంది. గత కొన్నేళ్లుగా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం అంకుర సంస్థలను అధికంగా ఆకర్షించింది. ఇప్పుడు ఆరోగ్య సేవలు, జీవశాస్త్రాల విభాగాల వంతు వచ్చింది. ఈ రంగాల్లో ఇటీవల కాలంలో పలు అంకుర సంస్థలు రావడమే కాకుండా, అవి కొత్త ఉపకరణాలు, ఉత్పత్తులు, సేవలు ఆవిష్కరిస్తున్నాయి. దీన్ని వైద్య సేవల రంగంలో సరికొత్త అధ్యాయంగా సంబంధిత వర్గాలు పరిగణిస్తున్నాయి. అంకుర సంస్థల ప్రవేశంతో వైద్య సేవల వ్యయాలు కొంతమేరకు తగ్గుముఖం పట్టే అవకాశం ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని పెద్దఎత్తున అందిపుచ్చుకోవటం ఈ సానుకూలతకు ప్రధాన కారణం.

## సరికొత్త ఉత్పత్తులు- సేవలు

వైద్య రంగం, జీవశాస్త్రాల విభాగంలో వస్తున్న మార్పులు, అంకుర సంస్థలను ఈ రంగం ఆకర్షించటం, సంబంధిత అంశాలపై అగ్రగామి కన్సల్టెన్సీ సేవల సంస్థ అయిన ఎర్నెస్ట్ అండ్ యంగ్ ఇటీవల ఒక అధ్యయనాన్ని నిర్వహించింది. దీని ఆధారంగా 'లైఫ్ సైన్సెస్ 4.0' అనే పేరుతో ఒక నివేదిక రూపొందించింది. ఎన్నో కొత్త విషయాలను ఈ నివేదిక వెలుగులోకి తెచ్చింది. దీని ప్రకారం...జీవశాస్త్రాలు, ఆరోగ్య సేవల రంగంలోని అంకుర సంస్థల్లో దాదాపు 18 శాతం సంస్థలు ఎన్నో వినూత్న, చౌక అయిన ఉపకరణాలు, సేవలు ఆవిష్కరిస్తున్నాయి. దేశంలో ఆరోగ్య రంగం ఎన్నో మార్పులకు లోనవుతున్నట్లు ఈ నివేదిక పేర్కొంది. ఆరోగ్య సేవలకు అనూహ్యంగా డిమాండ్ పెరుగుతున్నట్లు, సాంకేతిక పరిజ్ఞానం విస్తరణ, రోగుల్లో చైతన్యం విస్తరించటం... వంటి మార్పులు చోటుచేసుకుంటున్నట్లు వివరించింది. జీవనశైలి ఆధారిత జబ్బులు పెరగడం, వృద్ధుల సంఖ్య అధికం కావటంతో ప్రత్యేకమైన వైద్య సేవలకు గిరాకీ ఏర్పడుతోందని అభిప్రాయపడింది. కానీ ఈ డిమాండ్‌ను తీర్చగలిగినంత స్థాయిలో వైద్య వసతులు, సదుపాయాలు లేకపోవటం పెద్ద సమస్యగా ఉంది.

## సాంకేతిక పరుగులో ముందంజ

ఆరోగ్య సేవల రంగంలోకి వస్తున్న అంకుర సంస్థలు వినూత్న రీతిలో కార్యకలాపాలు సాగిస్తున్నాయి. ఎలా అంటే...

* వ్యాధుల తీరుతెన్నులపై పర్యవేక్షణ- రోగుల సమాచార సేకరణ, తక్కువ ఖర్చులో డయాగ్నస్టిక్ సేవలు అందించటం, ఐఓటీ ఆధారిత వైద్య ఉపకరణాల తయారీ, రోబో ఆధారిత సాంకేతిక పరిజ్ఞానం... వంటి అంశాలపై పలు సంస్థలు పనిచేస్తున్నాయి.

* వ్యాధులకు చికిత్స- జెనిటిక్, మాలిక్యులర్ డయాగ్నస్టిక్స్ ద్వారా వ్యక్తిగత ఔషధాలకు రూపకల్పన, ఐఓటీ ఆధారిత వ్యక్తిగత సర్జరీ ప్లాట్‌ఫామ్ తయారీ, ఏఐ- క్లౌడ్ ఆధారిత సర్జరీ పరిజ్ఞానాన్ని ఆవిష్కరించటంతో మరికొన్ని ముందున్నాయి.

* వ్యాధుల విశ్లేషణ పరిజ్ఞానం బాగా మార్పులకు లోనవుతోంది.

* ఆన్‌లైన్ పోర్టర్లు, టెలీ- మెడిసిన్, వ్యాధుల నివారణ పరిజ్ఞానం, ఉపకరణాల తయారీ.... సంబంధిత కార్యకలాపాలు విస్తరిస్తున్నాయి.

* వైద్యం, జీవశాస్త్రాల రంగంలో అంకుర సంస్థలు విభిన్నమైన ఉత్పత్తులు ఆవిష్కరించటమే కాకుండా ఇప్పటి వరకూ అనుసరిస్తూ వస్తున్న పద్ధతులను సమూలంగా మార్చివేసే విధానాలకు రూపకల్పన చేస్తున్నాయి. ఎలక్ట్రానిక్ ల్యాబ్ నోట్‌బుక్స్, తక్కువ ధరలో టెస్టింగ్ పధార్థాల తయారీ వంటివి ఆసక్తికర ఆవిష్కరణలుగా ఉంటున్నాయి. 3డీ సెల్ కల్చర్ టెక్నాలజీ, తయారీ సేవలు- భారీ స్థాయిలో ఔషధ తయారీకి అనువైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించటం... వంటి కొత్త పోకడలను ఆవిష్కరిస్తున్నాయి.

## నిధుల లభ్యతే ప్రధాన సమస్య

ఈ రంగంలో ఆసక్తికర మార్పులకు అంకుర సంస్థలు శ్రీకారం చుడుతున్నప్పటికీ వాటికి తగినంతగా నిధుల మద్దతు లభించటం లేదు. అదే పెద్ద సవాలుగా మారింది. ఐటీ రంగంలో అంకుర సంస్థలు పెద్దఎత్తున రహస్య పెట్టుబడిదార్లు (ఏంజెల్ ఇన్వెస్టర్లు), ప్రైవేట్ ఈక్విటీ ఫండ్లు, పెద్ద మదుపరులను ఆకర్షించగలుగుతున్నాయి, కానీ జీవశాస్త్రాల రంగంలో ఈ పరిస్థితి లేదు- అని ఎర్నెస్ట్ అండ్ యంగ్‌లోని జీవశాస్త్రాల విభాగం అధిపతి శ్రీరాం శ్రీనివాసన్ విశ్లేషించారు. ఈ విభాగంలో పరిశోధనలు పరిపక్వ దశకు చేరుకోవటానికి ఎక్కువ సమయం పడుతూ ఉండటం, వైఫల్యాల సమస్య అధికంగా ఉండటం దీనికి ప్రధాన కారణం. తమ పెట్టుబడి తగిన ప్రతిఫలాన్ని అందించలేకపోవచ్చనే అనుమానంతో ఎక్కువ మంది మదుపరులు ఈ రంగంలోని అంకుర సంస్థలకు పెట్టుబడులు సమకూర్చటానికి ముందుకు రావటం లేదు. అదేవిధంగా ఈ రంగంలోని పెద్ద సంస్థలతో భాగస్వామ్యాలు కుదుర్చుకోవటం కూడా వీటికి కష్టసాధ్యంగా మారింది.

Disclaimer: we collected these articles from Internet part of Social Awareness Campaign, we are thankful to the creators. We use for non-profit, free education purpose only. To know more, please visit: www.freegurukul.org